E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

మిరప రైతుల్లో ధరహాసం » 2లో

హైదరాబాద్ (తేదీ) 23-01-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక: 23 పేజీలు–6 www.ekaburu.com

సింగరేణిలో ఉత్పత్తి అధోముఖం

» 6.69 శాతం తగ్గుదల
» ధర అధికమని కొనుగోళ్లు తిరస్కరించిన 20 పరిశ్రమలు
» జెన్‌కో సైతం ఫిర్యాదు

ఈ కబురు, హైదరాబాద్: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, అమ్మకాలు తగ్గుతున్నాయి. కొత్త గనులు రాకపోవడం, పాత గనుల్లో పురోగతి లేకపోవడంతో సంస్థ అధోముఖంలో పయనిస్తోంది. సింగరేణి బొగ్గు విక్రయ ధరలు అధికంగా ఉన్నాయని ఇప్పటికే 20 పరిశ్రమలు ఈ సంస్థ నుంచి కొనుగోళ్లు మానేశాయి. ప్రస్తుతం విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు అమ్మకాలే సింగరేణికి కీలకంగా మారాయి.

తరువాయి 2లో

గచ్చిబౌలిలో 2500ల గజాల పార్కును కాపాడిన హైడ్రా

శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : నగరంలో హైడ్రా ఒకేరోజు రెండు ప్రాంతాల్లో తన పంజా విసిరింది. గచ్చబౌలిలో కబ్జాలను తొలగించి పార్కును కాపాడగా.. శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణలను తొలగించి అక్కడి నివాసితులకు దారి చూపించింది. ఈ రెండు ఆక్రమణల తొలగింపునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తరువాయి 3లో

గ్రూప్1 తీర్పు ఇంకా రెడీ కాలేదు: హైకోర్టు

» ఈకబురు, న్యూఢిల్లీ/గ్రూప్1 మెయిన్స్ పరీక్ష విషయంలో నెలకొన్న ఉత్కంఠ కొనసాగనుంది. ఈ అంశంపై తెలంగాణ హైకోర్టు ఇవాళ తీర్పు ఇవ్వాల్సి ఉండగా.. అది కాస్త వాయిదా పడింది. ఈ తీర్పుతో అప్పాయింట్‌మెంట్ లెటర్లు అందుకున్న అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండేది. అయితే..

» 2లో

దావోస్ పెట్టుబడులు రూ.28,693కోట్లు

» జీసీసీలు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ
» డబ్ల్యూఈఎఫ్ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు
» సీఎం నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' పర్యటన విజయవంతం అయ్యిందన్న ప్రభుత్వ వర్గాలు
» పెట్టుబడుల సాధన కన్నా 'రైజింగ్ 2047 విజన్' లక్ష్యాలు చాటి చెప్పడంపై సర్కారు దృష్టి
» మొత్తం 12 ముఖాముఖి సమావేశాల్లో పాల్గొన్న సీఎం
» ముగిసిన తెలంగాణ రైజింగ్ బృందం స్విట్జర్లాండ్ పర్యటన
» జ్యూరిచ్ నుంచి అమెరికాకు ముఖ్యమంత్రి రేవంత్

ఈకబురు, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సును 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధుల బృందం విజయవంతంగా పూర్తి చేసుకుంది. మూడు రోజుల పాటు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో జరిపిన చర్చలు, సంప్రదింపులు ఫల ప్రదంగా ముగిశాయి. రాష్ట్రంలో రూ.28,693 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం దావోస్ పర్యటనలో ఆశించిన లక్ష్యాలను సాధించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 'డబ్ల్యూఈఎఫ్-2026 సదస్సు'లో పెట్టుబడుల సాధన కంటే 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరినట్లు ప్రకటించాయి. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన విషయాన్ని గుర్తు చేశాయి.

పెట్టుబడులు.. కీలక ఒప్పందాలు

మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఏఐ, సుస్థిర అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి డబ్ల్యూఈఎఫ్ నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలంటూ సీఎం చేసిన ప్రతిపాదనపై డబ్ల్యూఈఎఫ్ వర్గాలు సానుకూలంగా స్పందించాయి.

తరువాయి 2లో

నైనీ టెండరు రద్దు
సీఎస్ఆర్ సంగతి తేల్చండి

» 'సింగరేణి'పై విచారణకు సాంకేతిక కమిటీ నియామకం
» కేంద్ర బొగ్గుశాఖ ఉత్తర్వులు
» మూడు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశం
» ఉత్తర్వు చేరేలోగానే హైదరాబాద్ వచ్చిన కమిటీ సభ్యులు

ఈ కబురు, హైదరాబాద్: సింగరేణి సంస్థ వ్యవహారాల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు కేంద్ర బొగ్గుశాఖ నడుం బిగించింది. ఒడిశాలోని నైనీ వద్ద బొగ్గు గని అభివృద్ధి, నిర్వహణ, ఆపరేటర్(ఎండీఓ) ఎంపిక కోసం 2025 నవంబరు 28న జారీ చేసిన టెండరు ప్రకటన రద్దుకు దారితీసిన పరిస్థితులతోపాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద నిధుల వినియోగం జరిగిన తీరుపై విచారణకు ఇద్దరు ఉన్నతాధికారులతో కూడిన సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశంతోనే కమిటీని ఏర్పాటు చేసినట్లు తన ఉత్తర్వుల్లో తెలిపింది. సంబంధిత ప్రతులు గురువారం సింగరేణి సంస్థకు అందగా... మధ్యాహ్నికల్లా కమిటీ సభ్యులు దిల్లీ నుంచి వచ్చి విచారణ ప్రారంభించడం గమనార్హం. విచారణ నివేదికను మూడు రోజుల్లోగా సమర్పించాలని కేంద్ర బొగ్గుశాఖ ఆదేశించడంతో ఆగమేఘాలపై హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో ఉన్న సింగరేణి కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర బొగ్గుశాఖలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్(డీడీజీ)గా పనిచేస్తున్న చేతన్ శుక్లా, సాంకేతిక విభాగం డైరెక్టర్‌గా పనిచేస్తున్న మారపల్లి వెంకటేశ్వర్లును విచారణ కమిటీ సభ్యులుగా నియమించింది. --పత్రాలన్నీ బయటపెట్టండి... నైనీతోపాటు సీఎస్ఆర్ నిధుల మంజూరు, వినియోగానికి సంబంధించిన అన్ని అధికారిక పత్రాలను వెంటనే తమ ముందు పెట్టాలని సింగరేణి అధికారులను కమిటీ సభ్యులు... కోరారు. వాస్తవానికి సింగరేణి ప్రధాన కార్యాలయం భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో ఉంది. కీలక విధానాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి పాలకమండలి సమావేశాలను హైదరాబాద్ కార్యాలయంలో నిర్వహిస్తుంటారు. అందుకే... కమిటీ అడిగిన పత్రాలను, గతంలో నైనీ, సీఎస్ఆర్‌కు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను కొత్తగూడెంతోపాటు, ఇతర ప్రాంతాల్లోని సింగరేణి కార్యాలయాల నుంచి ఆగమేఘాలపై తెప్పిస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, రాజకీయ నాయకుల సిఫార్సులతో సింగరేణి నుంచి సీఎస్ఆర్ నిధులను మంజూరు చేశారనే ఆరోపణలు వచ్చాయి.

తరువాయి 2లో

మన అమృత్ భారత్ రైలు నేడు ప్రారంభం



'చర్లపల్లి–తిరువనంతపురం' రైలును కేరళలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ఈ-కబురు, న్యూఢిల్లీ/హైదరాబాద్: తెలంగాణ రైల్వే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. శుక్రవారం దేశవ్యాప్తంగా నాలుగు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాని మోదీ కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రారంభించనున్నారు. అందులో భాగంగా తెలంగాణకు కేటాయించిన చర్లపల్లి–తిరువనంతపురం సూపర్‌ఫాస్ట్ రైలు కూడా ఉంది. ఇప్పటికే చర్లపల్లి–ముజఫర్‌పూర్ మధ్య అమృత్ భారత్ రైలు నడుస్తుండగా, ఇది రాష్ట్రానికి రెండో రైలు. రాష్ట్రానికి మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

రైలు వేళలు ఇలా...

17041 నంబరుతో ఈ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7.15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 2.45 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 17042 నంబరుతో బుధవారం సాయంత్రం 5.30కు తిరువనంతపురం నుంచి బయలుదేరి గురువారం

తరువాయి 2లో

నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు ఉత్పత్తి చేయాలి: తుమ్మల

» 3లో



మూడు కిలోల వెండితో 'వివాహ ఆహ్వాన పత్రిక'

» 3లో

కేటీఆర్‌కు సిట్ పిలుపు....

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నేడు విచారణ

భారాస ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించే అవకాశం

ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం. చోటుచేసుకుంది. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సిట్ 160 సీఆర్పీసీ కింద గురువారం నోటీసు జారీ చేసింది.

తరువాయి 2లో

ఫ్యూచర్ సిటీలో భారీ ఏఐ డేటా సెంటర్

రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన యూపీసీ వోల్ట్
3,800 మందికి ఉద్యోగావకాశాలు
రూ.623 కోట్లతో సైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ
దావోస్‌లో సీఎంతో ఆయా సంస్థల ప్రతినిధుల భేటీ

ఈ కబురు, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) సదస్సులో మూడోరోజు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం' పలు కీలక సమావేశాల్లో పాల్గొంది.

తరువాయి 2లో

గ్రూప్-1 తీర్పు ఇంకా రెడీ కాలేదు: హైకోర్టు

గత నెలలోనే సంబంధిత పిటిషన్లపై తీర్పు రిజర్వ్ చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం.. తీర్పును ఇవాళ్టికి వాయిదా వేసింది. అయితే ఇవాళ్టి తీర్పును ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని డివిజన్ బెంచ్ వెల్లడించింది.

2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట్ శివనగర్‌కు చెందిన కె.పరుశరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి.. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితాను రద్దు చేశారు. అలాగే..

గ్రూప్-1 మెయిన్స్ అన్ని సమాధాన పత్రాలను తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని కమిషన్‌ను ఆదేశించారు. ఇది సాధ్యంకాని పక్షంలో మెయిన్స్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని చెప్పారు. అయితే ఈ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు పలువురు సెలక్ట్ అయిన అభ్యర్థులు వేసిన పిటిషన్లను సీజే ధర్మాసనం విచారణ జరిపి తీర్పు వాయిదా వేసింది. తీర్పుతో 563 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఇప్పటికే వీళ్లు అప్పాయింట్‌మెంట్ లెటర్లు అందుకున్న సంగతి తెలిసిందే.

వాదనలు ఇలా..

టీజీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు. మూల్యాంకనంలో అవకతవకలు జరగకూడదన్న లక్ష్యంతో ఇద్దరి చేత చేయించారని తెలిపారు. పరీక్ష కేంద్రాల పెంపు, పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు హాల్‌టికెట్లను వేర్వేరుగా జారీ చేసిందని చెప్పారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగిందని ఎలాంటి ఆరోపణలు లేవని వెల్లడించారు.

కేటీఆర్‌కు సిట్ పిలుపు....

విచారణ నిమిత్తం శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని తమ కార్యాలయానికి రావాలని ఏసీపీ పి.వెంకటగిరి సూచించారు. ఈ నెల 20న ఇదే కేసులో హరీశ్‌రావును విచారించగా.. తాజాగా కేటీఆర్‌కు నోటీస్ జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకొంది. 'కేసు దర్యాప్తునకు ఉపకరించే అంశాలతో మీకు సంబంధమున్న నేపథ్యంలో ఆ వివరాలు వెల్లడించేందుకు విచారణకు రావాల' అని సూచించింది. భారాస ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ అక్రమ ట్యాపింగ్ జరిగిందంటూ 2024 మార్చిలో పంజాగుట్ట ఠాణాలో నమోదైన కేసును ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈకేసు దర్యాప్తులో భాగంగానే తాజాగా కేటీఆర్‌ను విచారణకు పిలిచింది. వాస్తవానికి కేసు నమోదై దాదాపు రెండేళ్లు కావస్తున్నా దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు.

--వ్యాపారులు ఫిర్యాదులు చేయడంతో...

ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు చాలాకాలం అమెరికాలోనే ఉండిపోవడంతో దర్యాప్తు అనుకున్న రీతిలో ముందుకు సాగలేదు. ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీస్ జారీ కావడంతో కొద్దిరోజుల క్రితం అమెరికా నుంచి వచ్చి పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఆయన్ని విచారించిన క్రమంలో లభించిన సమాచారం ఆధారంగా ప్రస్తుతం సిట్.. దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే మంగళవారం హరీశ్‌రావును విచారించిన సిట్.. తాజాగా కేటీఆర్‌ను విచారణకు పిలిచింది. ఆయన్ని భారాస ఆర్థిక లావాదేవీల గురించి ప్రశ్నించే అవకాశం కనిపిస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో ఉండటంతో వాటి గురించి విచారించే యోచనతో సిట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్‌బీఐ ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు బృందం తనను బెదిరించి భారాసకు రూ.12 కోట్ల ఎలక్టోరల్ బాండ్లతోపాటు పైవేటు పంచాయితీలో మరికొందరికి రూ.3 కోట్లు ఇప్పించారంటూ వ్యాపారి శ్రీధర్‌రావు సిట్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. మరికొందరు వ్యాపారులు సైతం ఇదే తరహా ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ విషయాలపై కేటీఆర్‌ను ప్రశ్నించే అవకాశమున్నట్లు సమాచారం. భారాసకు ఎలక్టోరల్ బాండ్లతోపాటు వేరే రూపంలో పార్టీకి ఆర్థిక వనరులు సమకూరడంలో ఫోన్ అక్రమ ట్యాపింగ్ పాత్ర గురించి తెలుసుకోవడంపై సిట్ దృష్టి సారించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే కేటీఆర్‌ను విచారించే అవకాశం కనిపిస్తోంది. విచారణ సందర్భంగా భారాస శ్రేణులు సిట్ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చే అవకాశమున్నట్లు అంచనా వేస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు

నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు ఉత్పత్తి చేయాలి: తుమ్మల

ఈ-కబురు ,హైదరాబాద్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సీజన్‌కు ముందే రైతు సాగు చేసే విస్తీర్ణాన్ని అంచనా వేసి, అందుకు అనుగుణంగా విత్తనాలను ఉత్పత్తి చేయాలన్నారు. గురువారం సచివాలయంలో ఆయన విత్తనాల పంపిణీ, ఆయిల్‌పామ్ సాగుపై సమీక్ష నిర్వహించారు. "రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో లేదు. అక్కడ ఉన్న ఆయిల్‌పామ్ కంపెనీల జోన్లను రద్దు చేసి, ఆసక్తి కలిగిన ఇతర కంపెనీలకు ఇవ్వాలి. ఆయిల్‌పామ్ రైతులకు యంత్రపరికరాలు అందుబాటులోకి తేవాలి. మార్కెఫెడ్ వద్ద గల జొన్న, మొక్కజొన్నలకు వెంటనే టెండర్లు పిలిచి విక్రయించాలి" అని మంత్రి సూచించారు.

మిరప రైతుల్లో ధరహాసం



ఈ-కబురు, ఖమ్మం వ్యవసాయం, వరంగల్ ఎనుమాముల మార్కెట్: మిరప దిగుబడులు క్షీణించి రైతులు దిగాలు చెందుతున్న పరిస్థితుల్లో.. ధరలు పెరుగుతుండటం వారికి కొంత ఊరటనిస్తోంది. గురువారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో తేజ మిర్చికి రికార్డు ధర పలికింది. క్వింటా రూ.21,200 పలకడంతో.. రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో ఈ రకానికి ఈ స్థాయిలో ధర రావడం.. ఇదే తొలిసారని అధికారులు వెల్లడించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.21,150 పలికింది. సుమారు 15 వేల బస్తాల సరకు మార్కెట్‌కు వచ్చింది.

నైనీ టెండరు రద్దు .. సీఎస్ఆర్ సంగతి తేల్చండి

--'గని సందర్శన' నిబంధనపై...

ఇటీవల ఒడిశాలో భాజపా అధికారంలోకి వచ్చాక నైనీలో బొగ్గు తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో నైనీకి ఎండీఓ ఎంపిక టెండర్ ప్రక్రియను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందో తెలుసుకోవడానికి సాంకేతిక కమిటీని హైదరాబాద్‌కు బొగ్గుశాఖ పంపింది. టెండర్ దాఖలుకు గని సందర్శన(విజిట్) సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదని సింగరేణి అధికారులను కమిటీ ప్రశ్నించినట్లు సమాచారం. ఈ సర్టిఫికెట్ ఇచ్చే అధికారం గని ప్రాంతంలో పనిచేస్తున్న జనరల్ మేనేజర్(జీఎం)కు ఉందని ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు కమిటీకి చెప్పినట్లు సమాచారం. దీంతో జీఎం వివరణను కూడా కమిటీ సభ్యులు అడిగినట్లు తెలుస్తోంది. ఈ సర్టిఫికెట్ జారీ చేయకుండా కొందరికి లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వచ్చినందునే... దేశవ్యాప్తంగా కోల్ ఇండియా, మహానది కోల్‌ఫీల్డ్స్ వంటి అన్ని బొగ్గు కంపెనీల్లో ఇలాంటి నిబంధన ఉందా అనే వివరాలను కమిటీ సేకరిస్తోంది.

--గతంలో కోర్టు చెప్పినందునే...

గతంలో టెండరు ఇచ్చిన సమయంలో గని విజిట్ సర్టిఫికెట్ నిబంధన లేదు. అయితే, ఒక గని పనులను ఓ ప్రైవేటు కంపెనీకి ఇచ్చినప్పుడు పనులు సరిగా చేయలేదని ఆ కంపెనీపై చర్యలు తీసుకుంటే కోర్టుకు వెళ్లారని... అప్పుడు ముందుగా గనిని పూర్తిగా పరిశీలించని వారికి పనులెందుకు అప్పగించారనే ప్రశ్నలు రావడంతోనే ఇలాంటి నిబంధనను టెండర్లలో పెట్టినట్లు సింగరేణి అధికారులు తాజాగా కేంద్ర బొగ్గుశాఖకు చెప్పినట్లు సమాచారం. వీరు చెప్పేదానిలో వాస్తవాలున్నాయా అనేది కూడా కమిటీ విచారణ చేస్తోంది.

--బొగ్గుశాఖ ఉత్తర్వుల్లో ఏముందంటే...

నైనీ టెండర్ల ప్రక్రియను రద్దు చేయడానికి దారితీసిన కారణాలను గుర్తించాలి. ఇతర బొగ్గు కంపెనీల్లో ఎండీఓ ఎంపికకు, వివిధ పనులను అప్పగించడానికి అనుసరిస్తున్న విధానాలను, సింగరేణితో పోల్చి చూసి... విచారణ చేయాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద సింగరేణిలో నిధుల వినియోగం ఎలా ఉంది... నిబంధనల ప్రకారం ఎన్ని నిధులను ఖర్చు చేశారో పరిశీలించాలి. తక్షణమే సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్లి, విచారణ చేసి, మూడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలి.

సింగరేణిలో ఉత్పత్తి అధోముఖం

ఈ ప్లాంట్ల యాజమాన్యాలూ అధిక ధరల కారణంగా తప్పుకోవాలని చూస్తున్నాయి. సింగరేణి బొగ్గు విక్రయ ధరలు అధికంగా ఉన్నందున తమపై భారం పడుతోందని జెన్‌కో తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. ఈ కారణంగానే తమ ప్లాంట్లలో విద్యుదుత్పత్తి వ్యయం అధికంగా ఉందని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి సమర్పించిన నివేదికలోనూ స్పష్టం చేసింది. 202122లో 65.53 మిలియన్ టన్నుల (ఎంటీ) బొగ్గును సింగరేణి రవాణా చేయగా... 202425లో అది 65.23 ఎంటీలకు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లో గత ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 9 నెలల్లో 51.47 ఎంటీల ఉత్పత్తి, అమ్మకాలు సాధించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నా 43.73 ఎంటీలే ఉత్పత్తి చేసి 44.17 ఎంటీల అమ్మకాలను నమోదు చేసింది. గతేడాది ఇదే 9 నెలలతో పోలిస్తే... ఉత్పత్తి 6.69 శాతం, అమ్మకాలు 4.35 శాతం తగ్గాయి. కోల్ ఇండియాతో పోలిస్తే సింగరేణి టన్ను విక్రయ ధర కొన్నిగ్రేడ్‌లలో 100 శాతం వరకూ అధికంగా ఉంది. అధిక ధరలు చెల్లిస్తున్నా నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం లేదని సింగరేణికి జెన్‌కో లేఖ రాసింది. నాణ్యత లేని బొగ్గు కారణంగా ప్లాంట్లలో విద్యుదుత్పత్తి తగ్గడంతో పాటు కాలుష్యం అధికంగా వెలువడుతోందని జెన్‌కో ఇంజినీర్లు 'ఈనాడు'కు చెప్పారు.

జాతీయ విద్యుదుత్పత్తి సంస్థ (ఎన్టీపీసీ) కూడా సింగరేణి బొగ్గు ధర అధికంగా ఉందని, కోల్ ఇండియా లేదా మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి తమకు సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని కేంద్ర బొగ్గు శాఖను కోరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవల దిల్లీలో ఈ శాఖ నిర్వహించిన జాతీయ బొగ్గు ఉత్పత్తి సంస్థల సమావేశంలో సింగరేణి పనితీరు, నాసిరకం బొగ్గు ఉత్పత్తి, అధిక ధరలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఓ అధికారి 'ఈనాడు'కు చెప్పారు.

దావోస్ పెట్టుబడులు రూ.28,693కోట్లు

మొదటి పేజీ తరువాయి

స్వదేశానికి మంత్రులు

ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాలతో జరిగిన 12 ముఖాముఖి సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం.. తెలంగాణ ప్రతినిధి బృందం మూడు రోజుల దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. దావోస్‌లో కార్యక్రమాలు ముగించుకున్న ముఖ్యమంత్రి.. రోడ్డు మార్గంలో జ్యూరిచ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి అమెరికాకు బయలుదేరి వెళ్తారు. తెలంగాణ బృందంలో సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు.

మన అమృత్ భారత్ రైలు నేడు ప్రారంభం

ఈ రైలు నల్లగొండ, గుంటూరు, తెనాలి, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, ఈరోడ్ – కోయంబత్తూరు, పాలక్కాడ్, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, కాయంకులం రైల్వే స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించనుంది. ప్రస్తుతం ఇదే రూట్‌లో శబరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంది. కొత్తగా ప్రారంభం కానున్న అమృత్‌భారత్ వల్ల అయ్యప్ప భక్తులకు భారీ ఊరట లభించనుంది. నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లలో హాల్ట్‌ింగ్ సదుపాయం ఉంది. ఈ ట్రైన్‌లో 11 సాధారణ బోగీలు, 8 స్లీపర్ బోగీలు ఉన్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించొచ్చు.

ఫ్యూచర్ సిటీలో భారీ ఏఐ డేటా సెంటర్

ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ బృందంతో పలు సంస్థలు పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో 'యూపీసీ వోల్ట్' సంస్థ డేటా సెంటర్‌ను స్థాపించడానికి ముందుకొచ్చింది. దీని ద్వారా 3,800 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. 'స్నెడర్' సంస్థ రూ.623 కోట్లతో తమ యూనిట్ల విస్తరణ ప్రణాళికను ప్రభుత్వం ముందుంచింది.

--నెదర్లాండ్స్ సంస్థతో కీలక ఎంఓయూ

దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ఈ మేరకు దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రెన్యూవబుల్స్ ఏపీఏసీ సహా వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రెన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌లతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం... ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో.. ఏఐ డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుపై ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ డేటా సెంటర్ నిర్మాణ దశలోనే 3వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమయ్యాక మరో 800 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలకపాత్ర పోషిస్తాయి. పర్యావరణ పరిరక్షణతోపాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

--రూ.150 కోట్లతో గోద్రెజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణ

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో గురువారం గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రెజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పెంపకంలో ఏఐ వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రెజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్లతో విస్తరించే అవకాశాలపై చర్చించారు. ఫ్యూచర్ సిటీలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపైనా మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు (స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు) ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు సూచించారు. నాదిర్ గోద్రెజ్‌ను హైదరాబాద్‌కు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.

--సౌర, పవన విద్యుదుత్పత్తిపై 'ఐనాక్స్' ఆసక్తి

తెలంగాణను కాలుష్యరహిత మహానగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో తెలంగాణ రైజింగ్ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో పరస్పర సహకార అవకాశాలపై చర్చించారు. తెలంగాణలో తొలుత సౌర, పవన విద్యుదుత్పత్తి చేపట్టి, అనంతరం తయారీ రంగంలోకి విస్తరించేందుకు ఐనాక్స్ గ్రూప్ ప్రణాళికలు రూపొందిస్తోంది. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... "రాష్ట్ర పారిశ్రామిక రంగానికి క్లీన్ ఎలక్ట్రిసిటీని, గ్రీన్ హైడ్రోజన్‌ను అందించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నాం. డేటా సెంటర్లకు అధికస్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోంది. తెలంగాణ నూతన ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా క్యూర్, ప్యూర్, రేర్ ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం" అని వివరించారు.

--శంషాబాద్‌లో స్నెడర్ ఎలక్ట్రిక్ విస్తరణ

స్నెడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ శంషాబాద్, గాగిల్లాపూర్‌లలోని తమ యూనిట్లను రూ.623 కోట్లతో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో స్నెడర్ కంపెనీ సీఈవో దీపక్‌శర్మ సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునికీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రియల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ భద్రతకు సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరగనుంది. స్నెడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలో 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలున్నాయి. ఈ సంస్థ విస్తరణ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కృషి చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును ముఖ్యమంత్రి అభినందించారు. అనంతరం ఇంధన నిర్వహణ, ఆటోమేషన్, ఈవీ భాగాల తయారీలో స్మార్ట్ ఫ్యాక్టరీల విస్తరణపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్చించారు.

గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో మొదటి స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు

సంక్రాంతికి ఊరెళ్లిన సాఫ్టవేర్ ఉద్యోగి ఇంట్లో చోరీకి విఫలయత్నం

ఈకబురు, శేరిలింగంపల్లి : సంక్రాంతికి స్వస్థలానికి వెళ్లిన ఓ సాఫ్టవేర్ ఉద్యోగిని ఇంట్లో చొరబడిన దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ చోది ప్రయత్నంలో ఇంట్లో నుంచి ఎటువంటి వస్తువులు పోకపోవడంతో సాఫ్టవేర్ ఉద్యోగిని ఊపిరిపీల్చుకుంది. కాగా బాధితురాలి పిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు మొదటి స్పాట్ ఎఫ్ఐఆర్ ను నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్ పెక్టర్ బాలరాజు కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని జిపిఆర్ఎ క్వార్టర్స్ లో నివాసం ఉంటున్న జి.చందన శ్రీ(25) స్థానికంగా సాఫ్టవేర్ ఉద్యోగిణిగా పనిచేస్తుంది. కాగా సంక్రాంతి పండుగ కోసం తన స్నేహితులతో కలిసి చందన శ్రీ ఈనెల 11వ తేదీన స్వస్థలానికి వెళ్లి తిరిగి 19వ తేదీన తన ఇంటికి తిరిగి వచ్చింది. తన ప్లాట్ తాళం పగులగొట్టి ఉండగా, ఇంట్లోకి వెళ్లి చూస్తే ఇంట్లో ఉన్న బీరువా తాళాలు సైతం పగులగొట్టి, బట్టలు, సామాగ్రి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కాగా ఇంట్లో నగదు, ఆభరణాలు లేకపోగా, దొంగలు ఎటువంటి సామాగ్రిని సైతం చోరీ చేయలేదు. దీంతో చందన శ్రీ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు చందన శ్రీ నుంచి ఇంటి వద్దే పిర్యాదు తీసుకొని స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంటి

స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితురాలికి అందజేస్తున్న పోలీసులు

గచ్చిబౌలిలో 2500ల గజాల పార్కును కాపాడిన హైడ్రా

జెసిబితో ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా అధికారులు

శామీర్‌పేటలో రహదారి ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

టెలికాంనగర్ పార్కు స్థలం అంటూ బోర్డులు ఏర్పాటు చేసిన దృశ్యం

శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు

ఈకబురు, శేరిలింగంపల్లి : నగరంలో హైడ్రా ఒకేరోజు రెండు ప్రాంతాల్లో తన పంజా విసిరింది. గచ్చబౌలిలో కబ్జాలను తొలగించి పార్కును కాపాడగా.. శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణలను తొలగించి అక్కడి నివాసితులకు దారి చూపించింది. ఈ రెండు ఆక్రమణల తొలగింపునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి టెలికాంనగర్ లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు 1982లో 32 ఎకరాల పరిధిలో అప్పటి హుడా అనుమతితో లే ఔట్ వేశారు. ఇందులో 4వేల గజాలు పార్కుకోసం కేటాయించారు. కాగా ఇందులో 1500ల గజాల వరకూ ఆక్రమణకు గురికాగా, కబ్జాకు గురైన స్థలంలో నివాస సముదాయాలు కూడా వచ్చాయి. మిగిలిన 2500ల గజాల స్థలంలో సైతం ప్లాట్లు ఉన్నాయంటూ కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో టెలికామ్ నగర్ నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. 4 వేల గజాలు పార్కుకు కేటాయించినట్టు నిర్ధారణ అయ్యింది. ఇందులో కబ్జాకు గురైన 1500 గజల్లో ఇప్పటికే నివాస భవనాలు వెలువగా, వాటిని మినహాయించి మిగిలిన 2500ల గజాల పార్కు స్థలంలో సైతం తాత్కాలిక నిర్మాణాలు వెలిశాయి. దీంతో గురువారం జేసీబీలతో ఆక్రమణలు తొలగించడంతో పాటు పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో ఆక్రమణలకు ఆస్కారం లేకుండా సదరు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు...

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని శామీర్‌పేటలో గల ఫ్రెండ్స్ కాలనీలో రోడ్డు ఆక్రమణలను హైడ్రా గురువారం తొలగించింది. సర్వే నంబరు 1198లో 4.20 ఎకరాల పరిధిలో ఫ్రెండ్స్ కాలనీ పేరిట 1987వ సంవత్సరంలో లే ఔట్ వేశారు. ఇందులో 20 ఫీట్ల రహదారిని ఆక్రమించి గోడలు నిర్మించారు. గేటు కూడా ఏర్పాటు చేసి పక్కనే ఉన్న ప్లాట్లలోకి కలిపేశారు. శామీర్‌పేట పోలీసు స్టేషన్ మీదుగా వెళ్లే దారి ఆక్రమణకు గురై, మూసివేయడంతో హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. దీంతో క్షేత్రస్థాయిలో విచారించి రోడ్డు ఆక్రమణను హైడ్రా నిర్ధారించుకుంది. గురువారం రోడ్డు ఆక్రమణలను తొలగించిన హైడ్రా అధికారులు కాలనీ వాసులకు దారి చూపించారు. 15 ఏళ్లుగా తాము సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికి హైడ్రా చొరవతో తమకు దారి దొరికిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కొండాపూర్ లో ఘనంగా ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు

శ్రీరాముని ప్రత్యేక పూజల్లో రాధాకృష్ణ యాదవ్ తదితరులు

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రాధాకృష్ణ యాదవ్

రాముడు చేసిన ధర్మ కార్యాన్ని స్మరించుకొని ధర్మ మార్గంలో నడవాలి : రాధాకృష్ణ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ట రెండవ వార్షికోత్సవాన్ని గురువారం కొండాపూర్ లో ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ షాప్ అసోసియేషన్, జై శ్రీరామ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల చెందిన భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు గంగల రాధాకృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై.. తన తండ్రి గంగల నరసింహ యాదవ్ తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ట రెండవ వార్షికోత్సవంలో పాల్గొనడం తన అదృష్టం అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. అన్నప్రసాద వితరణ ద్వారా సేవాభావాన్ని చాటిన నిర్వాహకుల ప్రయత్నం అభినందనీయమని తెలిపారు. గంగల నరసింహ యాదవ్ మాట్లాడుతూ శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఎంతో ఆసందాన్ని కలిగించిందని, యువత సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి పట్ల మరింత ఆసక్తి చూపుతూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో రాధాకృష్ణ యాదవ్, నరసింహ యాదవ్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు, యువత, స్థానికులు పాల్గొన్నారు.

హెచ్ సి యు డిపోలో జాతీయ రోడ్డు భద్రత ఉత్సవాలు

నగదు బహుమతులు అందుకున్న సిబ్బందితో స్వాతిగౌడ్, శ్రీనాథ్ గౌడ్ తదితరులు

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం, నగదు ప్రోత్సాహకాలు

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండాపూర్ ఏఎంవిఐ స్వాతి గౌడ్, హెచ్ సియు డిపో మేనేజర్ శ్రీనాథ్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్సీయూ డిపోలో ఉత్తమంగా పనిచేస్తున్న ముగ్గురు డ్రైవర్లను ఎంపిక చేసి ఘనంగా సన్మానించడంతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా వాహనాల డ్రైవర్లు బాధ్యతాయుతంగా లేకపోతే తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను అపాయంలోకి నెట్టే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ఇతరులకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల భద్రత తమ చేతుల్లో ఉందని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా దేశంలో లక్షల మంది ప్రాణాలు విడుస్తున్నారని, దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి డివిజన్ విజిలెన్స్ ఎస్సై సురేంద్రనాథ్, హెచ్ సి యు ఈవీడియం వెంకటేష్ లతోపాటు హెచ్సీయూ డిపో అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. నగదు ప్రోత్సాహకాలను అందుకున్న వారిలో కే.అశోక్, డి. గోపాల్, సిహెచ్ ఎస్.రెడ్డిలు ఉన్నారు.

కేటీఆర్ కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కార్ నాటకం
చిర్రా రవీందర్ యాదవ్

రవీందర్ యాదవ్

ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నమని ఆగ్రహం

ఈకబురు, శేరిలింగంపల్లి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడంపై శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని అత్యున్నత న్యాయస్థానాలు తేల్చాయన్నారు. కుట్ర పూరితంగా ఇబ్బందులు పెట్టాలి అని చూస్తున్నారంటూ మండిపడ్డారు. పాలన గాలికి వదిలి సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలని దుయ్యబట్టారు. రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు తల్లడిల్లుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ప్రజల కర్మాకు వదిలేసి దావోస్.. అటు నుండి అమెరికా పర్యటన పెట్టుకున్నారన్నారు. సర్కారు సొమ్ముతో రేవంత్ జల్సాలు చేస్తున్నార ని విమర్శలు చేశారు. సంక్రాంతి పోయి వారం దాటినా రైతు భరోసా ఎప్పుడిస్తారో చెప్పడం లేదన్నారు. కనీసం దాని ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని అత్యున్నత న్యాయస్థానాలు తేల్చి చెప్పినా, రేవంత్ సర్కారు ఆడించినట్లు పోలీస్ యంత్రాంగం ఆడుతుండం విచారకరం అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారని, ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదంగా మారిందని వాపోయారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా న్యాయపరంగా ఎదుర్కొంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంతకుముందే చెప్పారని గుర్తుచేశారు. ప్రతిపక్షాలను అక్రమ కేసులు, నోటీసులతో వేధించడంపై సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు.

మూడు కిలోల వెండితో 'వివాహ ఆహ్వాన పత్రిక'

జైపుర్: బంగారం, వెండి ధరలు ఊహించని స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఇటువంటి సమయంలో రాజస్థాన్‌కు చెందిన శివ్ జోహారీ.. తన కుమార్తె వివాహం కోసం మూడు కిలోల స్వచ్ఛమైన వెండితో ప్రత్యేకంగా ఓ ఆహ్వాన పత్రికను (Silver Wedding Card) తయారు చేయించడం విశేషం. మొత్తం 128 విడిభాగాలతో రూపొందించిన ఈ పత్రికలో కనీసం ఒక్క మేకు లేదా స్క్రూ కూడా వినియోగించలేదట. దీన్ని తయారు చేసేందుకు దాదాపు రూ.25లక్షలు ఖర్చు అయినట్లు అంచనా.

ఈ వెండి ఆహ్వాన పత్రికలో 65 దేవతా విగ్రహాలను పొందుపరిచారు. పైభాగంలో గణేశుడి రూపాన్ని, ఇరుపక్కల శివ పార్వతుల విగ్రహాలను, వీటి కింద లక్ష్మీదేవి, విష్ణుమూర్తుల చిత్రాలను పొందుపరిచారు. వెంకటేశ్వరుడు, శ్రీకృష్ణుడి చిత్రాలతోపాటు విష్ణువు పది అవతారాలు కూడా ఉండటం విశేషం. మొత్తంగా దీన్ని తయారుచేసేందుకు దాదాపు ఏడాది సమయం పట్టిందని శివ్ జోహారీ పేర్కొన్నారు. తన కూతురి వివాహానికి బంధువులనే కాకుండా దేవుళ్లను ఆహ్వానించాలని కోరుకున్నానని, అందుకే దీన్ని తయారు చేయించానని అన్నారు.

ఇండిగోకు 'డిసెంబర్' దెబ్బ.. లాభంలో 78 శాతం క్షీణత

ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గురువారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.549.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2448.8 కోట్ల లాభంతో పోలిస్తే 78 శాతం క్షీణత నమోదైంది. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన విమాన సేవల్లో అంతరాయం వంటివి లాభాలపై ప్రభావం చూపాయి. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ.969 కోట్లు, కార్యకలాపాల అంతరాయాల కారణంగా రూ.577 కోట్లు ఖర్చయినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తంగా ఈ త్రైమాసికంలో రూ.1546 కోట్లు ప్రభావం పడినట్లు పేర్కొంది. కరెన్సీ లావాదేవీలకు సంబంధించి డాలర్ ఆధారిత భవిష్యత్ చెల్లింపుల కోసం మరో రూ.1,035 కోట్లను డిసెంబర్ త్రైమాసికంలో మినహాయించినట్లు ఇండిగో పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.24,540.6 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.22,992.8 కోట్లతో పోలిస్తే కాస్త పెరిగింది. గతేడాది డిసెంబర్‌లో వందలాది విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో టికెట్ మొత్తాలను కంపెనీ రిఫండ్ చేసింది. ప్రయాణికులకు పరిహారం చెల్లించడంతో పాటు, గుడ్‌వెల్ గెశ్చర్ ఓచర్ల కింద ఒక్కో ప్రయాణికుడికి రూ.10వేలు చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో పాటు ఇటీవల డీజీసీఏ ఇండిగోకు రూ.22 కోట్ల జరిమానా విధించడంతో పాటు రూ.50 కోట్లు బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 10 వరకు వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత పెట్టింది. ఈ ప్రభావం తాజా త్రైమాసిక ఫలితాల్లో కనిపించింది. రాబోయే త్రైమాసికంలోన ఈ ప్రభావం పడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బ్యాంకు ఖాతా లేకుండానే ఎఫ్‌డీ

జిటల్ చెల్లింపుల సంస్థ 'అమెజాన్ పే' తన ఆర్థిక సేవల విస్తరణలో భాగంగా వినూత్న ఆవిష్కరణను తీసుకొచ్చింది. ఇకపై అమెజాన్ పే ద్వారా వినియోగదారులు నేరుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ప్రకటించింది.

--రూ.1,000 నుంచీ... అమెజాన్ పే వినియోగదారులు ఈ సేవను పొందేందుకు బ్యాంకుల్లో ప్రత్యేకంగా పొదుపు ఖాతా ప్రారంభించాల్సిన అవసరం లేదు. అమెజాన్ పే యాప్ ద్వారానే, డిజిటల్ పద్ధతిలో డిపాజిట్ చేయొచ్చు. కనీస మొత్తం రూ.1,000. బ్యాంకు, కాలపరిమితిని బట్టి, గరిష్ఠంగా 8% వార్షిక వడ్డీ లభించే అవకాశం ఉంటుందని సంస్థ పేర్కొంది. సీనియర్ సిటిజన్లకు సాధారణ వడ్డీ రేటుపై అదనంగా 0.5% అదనపు వడ్డీ లభిస్తుంది.

--7 సంస్థలతో ఒప్పందం.....ఈ సేవల కోసం అమెజాన్ పే మొత్తం 7 సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, సైస్ వంటి ఎన్‌బీఎఫ్‌సీలు, శివాలిక్, సూర్యోదయ, ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, సౌత్ ఇండియన్ బ్యాంకు ఉన్నాయి. శ్రీరామ్ ఫైనాన్స్‌లో డిపాజిట్ చేసే మహిళా మదుపరులకు 0.5% అదనపు వడ్డీ లభిస్తుందని అమెజాన్ పే వెల్లడించింది.

--బీమా భరోసా.....అమెజాన్ పే భాగస్వామ్య బ్యాంకుల్లో చేసే డిపాజిట్లకు ఆర్‌బీఐ అనుబంధ సంస్థ డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) ద్వారా ఒక్కో డిపాజిటర్‌కు రూ.5 లక్షల వరకు బీమా భద్రత లభిస్తుందని అమెజాన్ పే సీఈఓ వికాస్ బన్సల్ పేర్కొన్నారు.

సరైన బ్యాంకును ఎంచుకోండి

తొలిసారి ఉద్యోగంలో చేరినప్పుడు లేదా ఇంటికి దగ్గరగా ఉందని ఏదో ఒక బ్యాంకులో పొదుపు ఖాతా తీసుకుంటాం. డిజిటల్ బ్యాంకింగ్, మారుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో మనం ఏ బ్యాంకును ఎంచుకుంటున్నాం అనే విషయంపై కాస్త శ్రద్ధ పెట్టడం ఇప్పుడు చాలా అవసరం. ముఖ్యంగా మీ బ్యాంకు ఖాతాలో ఎక్కువ మొత్తంలో నగదు నిల్వ ఉంచే అలవాటు ఉంటే, ఇది మరింత కీలకం అవుతుంది. మీ డబ్బుకు భద్రత ఉండాలి, అదే సమయంలో కొంత రాబడిని అందించేలా ఈ ఖాతా ఉండాలి. పొదుపు ఖాతా ముఖ్య ఉద్దేశం ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదును తీసుకునేందుకు వీలుండటం. కరెంటు బిల్లు కట్టడం, కిరణా సరకులు కొనడం, రోజువారీ ఖర్చులు చేయడంలాంటివి. కాబట్టి, మూడు నెలలకు సరిపోయే ఖర్చుల డబ్బును మాత్రమే అందులో ఉంచాలి. అంతకుమించి ఎక్కువ డబ్బును సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల పెద్దగా లాభం ఉండదు. ఈ ఖాతాపై బ్యాంకులు ఇచ్చే వడ్డీ కేవలం 2.5శాతమే. కొన్ని బ్యాంకులు ఇంకా తక్కువగానూ ఇస్తున్నాయి. వడ్డీ రేట్లతో పాటు బ్యాంకు విధించే ఛార్జీల గురించీ తెలుసుకోవాలి. కనీస బ్యాలెన్స్ లేకపోతే వేసే జరిమానాలు, ఏటీఎం ఛార్జీలు దీర్ఘకాలంలో భారమవుతాయి. మీ బ్యాంకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్‌ను సులభంగా నిర్వహించేలా ఉడాలి. వినియోగదారుల సేవలు బాగుండాలి. చిన్న పనులకూ ఇబ్బంది పెట్టే బ్యాంకును ప్రధాన ఖాతా తీసుకునేందుకు ఎంచుకోవద్దు. ఎక్కువ డబ్బును ఖాళీగా ఈ ఖాతాలో ఉంచొద్దు. ఉదాహరణకు మీ దగ్గర రూ.10లక్షల నుంచి రూ.50లక్షల వరకూ ఉంటే, దానిని పొదుపు ఖాతాలో ఉంచినప్పుడు మీరు చాలా నష్టపోతారు. ఆ డబ్బును వేరేచోట పెట్టుబడి పెడితే వచ్చే అధిక లాభాన్ని మీరు కోల్పోతున్నారని అర్థం. ఇలాంటప్పుడు అవసరానికి మించి ఉన్న డబ్బును ఫెక్సీ డిపాజిట్ ఖాతాలోకి మళ్లించడం మేలు. మీ డబ్బుకు అధిక రాబడి, భద్రత కావాలనుకున్నప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉత్తమం. రాబోయే కొద్ది రోజుల్లో స్కూలు ఫీజులు చెల్లించడానికి, ఇల్లు నిర్మాణానికో దాచిన డబ్బును మంచి బ్యాంకులో ఎఫ్‌డీ చేయడం మంచిది. ఇప్పుడు కాస్త వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. కాబట్టి, ప్రత్యామ్నాయంగా డెట్ ఫండ్లను ఎంచుకోవచ్చు. అత్యవసరం అయితే ఇందులో నుంచి డబ్బు తీసుకోవడమూ సులభమే. లిక్విడ్ లేదా అల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్లు పెద్ద మొత్తంలో డబ్బును స్వల్పకాలానికి దాచుకునేందుకు ఉపయోగపడతాయి. చాలామంది కొత్తగా బ్యాంకు ఖాతా ప్రారంభించేప్పుడు బ్యాంకులు ఇచ్చే 'వెల్కమ్ ఆఫర్లు' లేదా చిన్న వడ్డీ రేట్ల తేడాలనే చూస్తుంటారు. కానీ, అంతకన్నా ముందు ఆ బ్యాంకు ఎంత సురక్షితమైనది అనేది చూడాలి. మీ కష్టార్జితం, అత్యవసర నిధి ఉంచే బ్యాంకు ఎప్పుడూ నమ్మదగినదిగా ఉండాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, పెద్ద ప్రైవేటు బ్యాంకులు సాధారణంగా ఆర్థికంగా బలంగా ఉంటాయి. వాటిలో నష్టభయమూ తక్కువ. కొత్తగా వచ్చిన చిన్న బ్యాంకులు ఎక్కువ వడ్డీ ఇస్తుంటాయి. కానీ, మీ ప్రధాన ఖాతా ఎప్పుడూ పెద్ద బ్యాంకులో ఉండటమే శ్రేయస్కరం.

మ్యూచువల్ ఫండ్లపై రుణం ..ఇది ఎలా పని చేస్తుంది?

చాలా మంది అనేక మదుపు పథకాల్లో పెట్టుబడులు పెడుతుంటారు. వీరికి కొన్నిసార్లు అకస్మాత్తుగా డబ్బు అవసరం పడొచ్చు. అలాంటి సందర్భంలో మీ వద్ద ఈక్విటీ/డెట్ మ్యూచువల్ ఫండ్ యూనిట్లు ఉంటే, వాటిని బ్యాంకు/ఎన్‌బీఎఫ్‌సీ వద్ద తాకట్టుగా ఉంచి రుణం తీసుకోవచ్చు. మీకు అత్యవసరంగా రుణం అవసరం పడినప్పుడు మ్యూచువల్ ఫండ్లపై రుణం తీసుకోవడం ఒక మంచి అవకాశం. ఈ రుణానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

--**ఫండ్లపై రుణం.....**మీ మ్యూచువల్ ఫండ్ యూనిట్లను హామీగా ఉపయోగించడం ద్వారా రుణంగా నగదును తీసుకోవడానికి మీకు వీలుంటుంది. మీరు రుణానికి అర్హత పొందుతారా లేదా అనే విషయం ఫండ్ నిర్వహణ సంస్థ(AMC), మీ మ్యూచువల్ ఫండ్ రకాన్నిబట్టి ఉంటుంది. ఇందులో ఉన్న గొప్ప ప్రయోజనం ఏంటంటే, మీరు మీ పెట్టుబడులను విక్రయించాల్సిన అవసరం లేకుండా త్వరగా రుణాన్ని పొందవచ్చు. ఇది మీ మ్యూచువల్ ఫండ్ల యాజమాన్యాన్ని నిలుపుకుంటూనే వాటి విలువను ఉపయోగించుకోవడానికి ఒక మెరుగైన మార్గం.

--**రుణ శాతం....** సాధారణంగా, బ్యాంకులు..ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల విలువలో 50% వరకు, డెట్ మ్యూచువల్ ఫండ్ల విలువలో 80% నుంచి 85% వరకు ఆఫర్ చేయవచ్చు. ఉదాహరణకు, మీ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ యూనిట్ల విలువ రూ.20 లక్షలు ఉంటే, రూ.10 లక్షల వరకు రుణం పొందవచ్చు. అవి డెట్ ఫండ్స్ అయితే, మీరు రూ. 14-16 లక్షల వరకు రుణంగా పొందవచ్చు. స్వల్పకాలంలో ఈక్విటీ మార్కెట్ల స్వాభావిక అస్థిరత కారణంగా ఈక్విటీ ఫండ్లకు తక్కువ లోన్‌టువాల్యూ(LTV) ఉంటుంది. రుణం ఆమోదం తర్వాత, నిధులు నేరుగా మీ బ్యాంక్ ఖాతాలో జమవుతాయి. బ్యాంకు షరతుల ఆధారంగా, సమానమైన నెలవారీ వాయిదా(EMI)ల ద్వారా లేదా ఒకే చెల్లింపుగా రుణాన్ని తిరిగి చెల్లించే అవకాశం మీకు ఉంటుంది.

--**రుణం డిఫాల్ట్....**రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించడంలో విఫలమైతే వడ్డీ పేరుకుపోవడమే కాకుండా బ్యాంకు జరిమానాలు కూడా విధిస్తుంది. రుణ కాలవ్యవధిలో మ్యూచువల్ ఫండ్ యూనిట్లు బ్యాంకు వద్ద హామీగా ఉంటాయి. కాబట్టి, రుణం డిఫాల్ట్ అయిన సందర్భంలో బ్యాంకు ఫండ్లపై తనకు ఉన్న తాత్కాలిక హక్కును వినియోగించుకుని ఫండ్ హౌస్ ద్వారా మ్యూచువల్ ఫండ్ యూనిట్లను రిడీం చేసి రుణ రికవరీ చేసుకుంటుంది. రుణాన్ని పూర్తిగా క్లియర్ చేస్తే, బ్యాంకు మీ ఫండ్ల(హామీ)ని మీకు తిరిగి ఇచ్చేస్తుంది. అంటే, రుణాన్ని పూర్తిగా చెల్లించిన తర్వాత, ఫండ్లపై తాత్కాలిక హక్కును వదులుకుంటుంది.

--**అర్హతలు....** మీరు డీమెటీరియలైజ్డ్ (డీమ్యాట్) రూపంలో మ్యూచువల్ ఫండ్లను కలిగి ఉండాలి. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. రుణ కాలవ్యవధిలో మీ మ్యూచువల్ ఫండ్ యూనిట్ల విలువ బాగా పడిపోతే, బ్యాంకు అదనపు హామీ అడగవచ్చు లేదా రుణంలో కొంత మొత్తాన్ని పాక్షికంగా చెల్లించమని అడగవచ్చు. వీటికి కూడా సిద్ధంగా ఉండాలి.

--**ఫండ్లు యాక్టివ్.....** ఇలాంటి రుణం వల్ల ప్రయోజనం ఏంటంటే ఫండ్లను రుణానికి పూచీకత్తుగా ఉపయోగించినప్పటికీ మీ మ్యూచువల్ ఫండ్లు మార్కెట్లలో యాక్టివ్‌గానే ఉంటాయి. ఈ పరిస్థితిలో మీరు వాటిని అమ్మలేరు. అయితే, ఫండ్లపై వచ్చే లాభ, నష్టాలు ఎప్పటికప్పుడు నమోదు అవుతూనే ఉంటాయి. మార్కెట్ ద్వారా లభించే లాభ, నష్టాలు రుణగ్రహీతకే వర్తిస్తాయి. మ్యూచువల్ ఫండ్లపై రుణం తీసుకోవడం వల్ల మీ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను కాపాడుకుంటూ, స్వల్పకాలిక నగదు అవసరాలను తీర్చుకోవచ్చు.

--**వడ్డీ రేట్లు....** ఫండ్లపై రుణాలు సాధారణంగా వ్యక్తిగత లేదా క్రెడిట్ కార్డుల రుణాల కంటే తక్కువ వడ్డీ రేట్లను కలిగి ఉంటాయి. ఎందుకంటే, ఈ రుణంపై మ్యూచువల్ ఫండ్లు హామీగా ఉండి బ్యాంకుకు భద్రతగా పనిజేస్తాయి. ఈ హామీతో బ్యాంకులు సురక్షిత రుణంగా భావించి చౌక వడ్డీ రేట్లను విధిస్తాయి. ఈ రేట్లు సాధారణంగా సంవత్సరానికి 8-12% మధ్య ఉండొచ్చు. ఇక్కడ ఫండ్లు హామీగా ఉంటాయి కాబట్టి, క్రెడిట్ స్కోరును పూర్తిగా పరిగణనలోకి తీసుకోరు. మీరు సమయానికి రుణం తిరిగి చెల్లిస్తే, మీ క్రెడిట్ ప్రొఫైల్ మెరుగుపడుతుంది.

--**రుణ మంజూరు.....**ఇతర రుణాలతో పోలిస్తే, ఈ రుణాలు తక్కువ పేపర్ వర్క్/ప్రాసెసింగ్‌ను కలిగి ఉంటాయి. ఆఫ్‌లైన్‌లోనే కాకుండా బ్యాంకు వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లోకి వెళ్లి కూడా రుణానికి దరఖాస్తు చేయొచ్చు. సాధారణంగా ఈ ప్రక్రియ 24గంటల లోపు పూర్తయి రుణం మంజూరవుతుంది.

--**ఏ అవసరంకైనా....**వ్యక్తిగత, వ్యాపార ఖర్చులు, అత్యవసర ఖర్చులకు త్వరిత నగదు అవసరమైనప్పుడు ఇలాంటి రుణం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వినియోగ పరిమితులు ఉన్న కొన్ని ఇతర రుణ రకాల మాదిరిగా కాకుండా, మ్యూచువల్ ఫండ్లపై మీరు పొందిన రుణ మొత్తాన్ని వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చు. మీరు నగదును ఎలా ఉపయోగించవచ్చనే దానిపై ఎటువంటి పరిమితులు లేవు, ఇది పూర్తిగా మీ ఇష్టం. విద్యకు సంబంధించిన ఫీజులు, వివాహం, వైద్య అత్యవసర పరిస్థితికి చెల్లించడం, వ్యక్తిగత అవసరాలు వంటి వివిధ రకాల ఆర్థిక ఇబ్బందులను తీర్చుకోవడానికి ఈ రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

క్రెడిట్ స్కోరు

రుణం లేదా క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు.. 'మీ సిబిల్ స్కోరు తక్కువగా ఉంది.. పాత బాకీ ఏదో కనిపిస్తోంది'.. అని బ్యాంకు సిబ్బంది అనడం చూస్తూనే ఉంటాం. వెంటనే మనం ఆ బాకీని చెల్లించినా.. ఆ విషయం మన క్రెడిట్ నివేదికలో కనిపించేందుకు కనీసం 30-40 రోజులు పట్టేది. ఈలోపు అత్యవసరంగా రుణం కావాల్సిన వారికి ఈ ఆలస్యం పెద్ద సమస్యగా ఉండేది. కానీ, ఇప్పుడు ఆ ఇబ్బంది తప్పింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల మేరకు క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలు రుణ చరిత్ర నివేదికల తీరును మారుస్తున్నాయి. ఇంతకుముందు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ రుణగ్రహీతల లావాదేవీల వివరాలను నెలకోసారి క్రెడిట్ బ్యూరోలకు పంపించేవి. మారిన నిబంధనల నేపథ్యంలో అవి ప్రతి 15 రోజులకోసారి సమాచారాన్ని బ్యూరోలకు అందిస్తున్నాయి. జులై 1 నుంచి వారానికోసారి ఈ సమాచారాన్ని అందించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. అంటే, వారం, పది రోజుల్లోనే మీ లావాదేవీల వివరాలు స్కోర్లో ప్రతిబింబిస్తాయన్నమాట.

----లాభమేమిటి?... మీరు ఏదైనా పాత అప్పు తీర్చిన వెంటనే అది రికార్డుల్లోకి చేరిపోతుంది. దీనివల్ల మీ స్కోరు వేగంగా పెరిగి, కొత్త లోన్ పొందే అర్హత వెంటనే వస్తుంది. ఒకవేళ మీ క్రెడిట్ రిపోర్టులో మీకు సంబంధం లేని రుణం ఏదైనా కనిపిస్తే, వెంటనే బ్యాంకును సంప్రదించి, సరిచేయాల్సిందిగా కోరొచ్చు. తప్పును సరిదిద్దగానే రిపోర్టులో కనిపిస్తుంది. కాబట్టి, మోసాలకు తావుండదు. కొత్త నిబంధనల్లో వినియోగదారులకు ఇచ్చిన మరో ఊరట.. మీ క్రెడిట్ నివేదికలో తప్పులున్నాయని ఫిర్యాదు చేసినప్పుడు బ్యాంకులు, క్రెడిట్ బ్యూరోలు 30 రోజుల్లోగా పరిష్కరించాలి. గడువు దాటితే రోజుకు రూ.100 చొప్పున ఖాతాదారుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

--**ఇవి గుర్తుంచుకోండి.....**

రుణానికి దరఖాస్తు చేసుకునేప్పుడు కనీసం 10-15 రోజుల ముందే మీ స్కోరు ఒకసారి తనిఖీ చేసుకోండి. ఏదాదికోసారైనా పూర్తి క్రెడిట్ రిపోర్టును తీసుకోండి. దీనికి ఎలాంటి రుసుములూ ఉండవు. అందులో మీ చిరునామా, పాన్, రుణాల వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోండి. రిపోర్టులో తప్పులుంటే, వెంటనే సంబంధిత క్రెడిట్ బ్యూరో వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. దానికి సంబంధించిన సర్వీస్ రిక్వెస్ట్ నంబరును భద్రపర్చుకోండి.

--**మోసపోవద్దు! .... 'రూ.500 చెల్లించండి.. మీ క్రెడిట్ స్కోరును 800 చేస్తాం' అంటూ సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రకటనలు వస్తుంటాయి. వీటిని నమ్మొద్దు. మీ స్కోరును ఎవరూ పెంచలేరు. మీరు బాకీలను సకాలంలో చెల్లించినప్పుడు మాత్రమే స్కోరు పెరుగుతుంది. మోసగాళ్లను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దు.**



ఫ్లాప్ మూవీ టైటిల్‌తో వస్తున్న విశాల్..



తమిళంతో పాటు, తెలుగులోనూ తన చిత్రాలతో అలరిస్తుంటారు విశాల్. ఆయన కథానాయకుడిగా సుందర్ సి దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతోంది. దీనికి 'మొగుడు'అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం వీడియోను పంచుకుంది. విశాల్ 36వ చిత్రంగా రూపొందుతున్న ఈ మూవీలో తమన్నా కథానాయిక. యోగిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. భర్తకు ఆర్డర్స్ వేసే భార్యగా తమన్నా కనిపించగా, ఒకవైపు విశాల్ ఇంట్లో పనులు చేస్తూనే యాక్షన్‌తో అదరగొడుతున్నారు. యోగిబాబు కామెడీ నవ్వులు పంచుతోంది. కామెడీ యాక్షన్ మేళవించి సినిమాను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

'హ్యాపీరాజ్' ఆట

పెళ్లి చేసుకుంటావా? అని అమ్మాయి అడగడమే ఆలస్యం... 'నేనుగనక నిన్ను పెళ్లి చేసుకుంటే ఈ ప్రపంచంలో నేనే హ్యాపీ' అంటూ ఎగిరి గంతేశాడు హ్యాపీరాజ్. కానీ అసలు ఆట ఆ తర్వాతే మొదలైంది. మరి వీరి పెళ్లి ఎలా జరిగిందో తెలియాలంటే 'హ్యాపీరాజ్' చూడాల్సిందే. జీవీ ప్రకాశ్‌కుమార్, శ్రీ గౌరిప్రియ జంటగా తెరకెక్కుతున్న చిత్రమిది. మారియా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. జైవర్ధన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు ప్రచార చిత్రాన్ని ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ గురువారం విడుదల చేశారు.

బాలీవుడ్‌ను ఏలబోయే మహారాణి.. యంగ్ హీరోయిన్‌పై పొగడ్తల వర్షం

బ్యూటిఫుల్ కళ్యాణి ప్రియదర్శన్ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ 'కొత్త లోక'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఆమె.. ఈ ఫాంటసీ యాక్షన్ ద్వారా పాన్-ఇండియా లెవల్‌లో సూపర్ హిట్ మంచి గుర్తింపు సంపాదించింది. రూ. 300 కోట్ల కలెక్షన్స్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయిపోయింది. దీంతో ఆమె బాలీవుడ్ ఆఫర్ కొట్టేసింది. జాంబీ-అపోకలిప్స్ థ్రిల్లర్ 'ప్రళయ్'లో హీరోయిన్‌గా నటిస్తోంది. రణ్‌వీర్ సింగ్ నటిస్తూ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమా ద్వారా హిందీలోకి డెబ్యూ కానుంది. దీంతోపాటు లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరోసారి వైరల్ అయిపోయింది బ్యూటీ. స్లీక్ బ్లాక్ డ్రెస్‌లు, ఎలీ సాబ్, వెర్సాస్ జెర్సీ గౌన్‌లు వైరల్ అవుతున్నాయి. థై-హై స్లిట్‌తో, ఎలిగెంట్ లుక్స్‌తో ఆమె సెన్సువాలిటీ, గ్రేస్‌ను చూసి ఫ్యాన్స్ పొగుడుతున్నారు. జెన్-Z ఫ్యాషన్ ట్రెండ్‌సెట్టర్‌గా.. రష్మిక తర్వాత బాలీవుడ్‌ను ఏలబోయే టాలెంటెడ్ సౌత్ గర్ల్‌గా, మహారాణిగా కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు.

బ్లాక్ బస్టర్ హిట్ ఎఫెక్ట్.. భారీగా రెమ్యునరేషన్ పెంచేసిన నవీన్ పొలిశెట్టి..

టాలీవుడ్ యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి తన నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన నవీన్.. తొలి ప్రయత్నంతోనే విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. అయితే అసలైన బ్రేక్ మాత్రం 'జాతి రత్నాలు'తో వచ్చింది. ఈ సినిమా నవీన్ కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. కడుపుబ్బా నవ్వించే వినోదంతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలవడంతో నవీన్ ఒక్కసారిగా స్టార్ హీరోల సరసన నిలిచాడు. ఈ సినిమా తర్వాత ఆయన క్రేజ్, ఫాలోయింగ్ మరింత పెరిగాయి. 'జాతి రత్నాలు' తర్వాత చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయాయి.

అయినప్పటికీ నవీన్ పొలిశెట్టి క్రేజ్ మాత్రం తగ్గలేదు. 2023లో స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టితో కలిసి 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'పై నటించాడు. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను పూర్తిగా మెప్పించ లేకపోయింది. దీంతో నవీన్ కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇచ్చి, సరైన కథల ఎంపికపై దృష్టి పెట్టాడు. ఇక ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' సినిమాతో గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చాడు నవీన్ పొలిశెట్టి. ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన పొందడంతో పాటు బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో దూసుకు పోతోంది. సినిమా విజయం నవీన్ కెరీర్‌కు కొత్త ఊపును తీసుకొచ్చింది. ఈ క్రమంలో.. తాజాగా నవీన్ పొలిశెట్టికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 'అనగనగా ఒక రాజు' (Anaganaga Oka Raju)హిట్ తర్వాత ఆయన రెమ్యునరేషన్ భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. తదుపరి సినిమాకు నవీన్ పొలిశెట్టి దాదాపు రూ. 15 కోట్ల వరకు పారితోషికం అందుకోనున్నాడని టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

పెద్ది ఫస్ట్ హాఫ్ ఫినిష్.. బుచ్చిబాబు జోరు మాములుగా లేదు!



రామ్ చరణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ సినిమా పెద్ది. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ సినిమా వస్తోంది. రామ్ చరణ్ హీరోగా చేస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా మెరువనున్నారు. అంతేకాదు ఈ సినిమాలో స్పెషల్ సాంగ్ కూడా ఉందట. వేగంగా షూటింగ్ జరుపుకుంటున్న పెద్ది సినిమా గురించి తాజాగా కీలక అప్డేట్ వచ్చింది. ఈ సినిమా ఫస్ట్ హాఫ్ పూర్తయిందట. మొదటి భాగాన్ని పూర్తిచేసి ఎడిటింగ్ కు పంపించారట. మరో నెల రోజుల్లోనే సెకండ్ హాఫ్ కూడా పూర్తి కాబోతున్నట్లు టాక్ నడుస్తోంది. మొత్తానికి మార్చి 27వ తేదీకి సినిమా రిలీజ్ చేసేందుకు బుచ్చిబాబు సిద్ధమవుతున్నారట. ఈ న్యూస్ ఇప్పుడు వైరల్ గా మారింది.

రామ్ చరణ్ హీరోగా చేస్తున్న పెద్ది స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తోంది. ఇందులో శివ రాజ్ కుమార్ స్పెషల్ రోల్ చేస్తున్నారు. జగపతిబాబు, బోమన్ ఇరానీ కనిపించనున్నారు. ఈ సినిమాలో చికిరి చికిరి అనే పాటను ఏఆర్ రెహమాన్ అద్భుతంగా తెరకెక్కించారు. ఈ పాట యూట్యూబ్ ఇప్పటికీ ట్రెండింగ్ లోనే ఉంది.

ఆస్కార్ నామినేషన్లలో 'సిన్నర్స్' రికార్డు



ప్రపంచ సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 98వ ఆస్కార్ నామినేషన్ల జాబితా రానే వచ్చింది. అకాడమీ బృందం గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇందులో ర్యాన్ కూగ్లర్ దర్శకత్వం వహించిన 'సిన్నర్స్' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ ఎడిటింగ్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైనింగ్‌తో సహా పలు విభాగాల్లో అత్యధికంగా 16నామినేషన్లు సొంతం చేసుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇప్పటి వరకూ 14 నామినేషన్స్‌తో 'ఆల్ అబౌట్ ఈవ్', 'టైటానిక్', 'లాలా ల్యాండ్' పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడా రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించిందీ చిత్రం. హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో మైఖేల్ బి.జోర్డాన్ ప్రధాన పాత్ర పోషించారు. స్మోక్, స్టాక్ అనే ఇద్దరు కవల సోదరుల చుట్టూ తిరిగే ఈ కథ.. మలుపులు, సస్పెన్స్‌తో సినీప్రియుల్ని సీటు అంచున కూర్చోబెట్టింది. దీని తర్వాత అమెరికన్ బ్లాక్ కామెడీ చిత్రం 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' ఎక్కువ నామినేషన్లను దక్కించుకుంది. దీనితో పాటు 'బుగోనియా', 'ఎఫ్ 1', 'ఫ్రాంకెన్ స్టైయిన్', 'హామ్నెట్', 'ది సీక్రెట్ ఏజెంట్' తదితర చిత్రాలు పలు విభాగాల్లో నామినేషన్లను అందుకొని బరిలోకి దిగాయి. వీరితో పాటు భారతీయఅమెరికన్ దర్శకనిర్మాత గీతా గాండ్భీర్ రెండు ఆస్కార్ నామినేషన్లను గెలుచున్నారు. ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ విభాగంలో...ఆమె దర్శకనిర్మాణంలో రూపొందిన 'ది పర్ఫెక్ట్ నైబర్' అనే లఘు చిత్రం, ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ కేటగిరిలో 'ది డెవిల్ ఈజ్ బిజీ' నిలిచాయి. మార్చి 15న ఆస్కార్ వేడుక జరగనుంది.

మన 'హోమ్‌బౌండ్'కు నిరాశే

ఈ ఏడాది మన దేశం తరఫున ఆస్కార్ పురస్కారాల్లో పోటీకి సిద్ధమైన 'హోమ్‌బౌండ్'కు నిరాశ ఎదురైంది. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో షార్ట్ లిస్ట్ జాబితాలో చోటు దక్కించుకున్న ఈ సినిమా తాజాగా వెల్లడించిన ఆస్కార్ జాబితాలో నామినేషన్‌ను సొంతం చేసుకోలేకపోయింది. జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్ జంటగా నటించిన చిత్రమిది. నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత.



ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు...

జోరు మీదున్న టీమిండియా

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

రాయ్‌పూర్: న్యూజిలాండ్‌తో తొలి టి20లో ఘన విజయం తర్వాత భారత్ మరో విజయంపై గురి పెట్టింది. గత పోరులో అన్ని రంగాల్లో సమష్టిగా రాణించిన జట్టు 2-0తో ఆధిక్యం అందుకోవాలని భావిస్తోంది. మరో వైపు న్యూజిలాండ్ కోలుకునే ప్రయత్నంలో ఉంది.

ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు షహీద్ వీర్ నారాయణ్ సింగ్ స్టేడియంలో రెండో టి20 మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను బట్టి చూస్తే భారత్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే అక్షర్ పటేల్ గాయం నుంచి కోలుకున్నాడా లేదా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

సామ్సన్, ఇషాన్‌లపై దృష్టి...

తొలి టి20లో భారత బ్యాటర్లలో అభిక్ శర్మ చెలరేగగా, సూర్యకుమార్ కూడా చాలా కాలం తర్వాత చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు పాండ్యా ప్రభావం చూపించగా... ఫినిషర్‌గా రింకూ సింగ్ తన పేరును నిలబెట్టుకున్నాడు.

అయితే సామ్సన్, ఇషాన్ కిషన్ మాత్రమే ప్రభావం చూపలేకపోయారు. గిల్‌ను తప్పించడంతో టి20 టీమ్‌లో ఓపెనర్‌గా తన స్థానం చేసుకున్న సామ్సన్ అంచనాలకు తగినట్లుగా ఆడాల్సి ఉంది. అదే విధంగా వరల్డ్ కప్ టీమ్‌లో కూడా చోటు దక్కించుకున్న ఇషాన్ కిషన్‌పై నమ్మకంతో మేనేజ్‌మెంట్ మూడో స్థానంలో ఆడే అవకాశం కల్పించింది. ఒక్క మ్యాచ్‌లో వైఫల్యం సమస్య కాకపోయినా... చెత్త షాట్‌లతో వీరు వికెట్లు సమర్పించుకున్నారు. ఈసారి తప్పులు దిద్దుకునే అవకాశం వీరికి ఉంది. పేస్ బౌలింగ్‌లో మరోసారి అర్‌ష్‌దీప్, బుమ్రా ప్రదర్శనపై జట్టు ఆధార పడి ఉండగా, పాండ్యా కూడా కీలక పాత్ర పోషిస్తాడు. స్పిన్నర్లుగా వరుణ్, అక్షర్ ప్రత్యర్థిపై పైచేయి సాధించగలరు. అయితే తొలి మ్యాచ్‌లో చేతికి గాయంతో బౌలింగ్ నుంచి తప్పుకున్న అక్షర్ ఆడకపోతే మరో స్పిన్నర్ బిష్ణోయ్‌కు చోటు లభించవచ్చు.

తుది జట్టులోకి బ్రేస్‌వెల్!

భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ గత మ్యాచ్‌లో న్యూజిలాండ్ పోరాడినా ఫలితం లేకపోయింది. అయితే ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చి సిరీస్‌ను సమం చేయాలని జట్టు ఆశిస్తోంది. టాప్-3 విఫలం కావడంతో జట్టును దెబ్బ తీసింది. వన్డే సిరీస్‌లో కూడా ఘోరంగా విఫలమైన కాన్వే ఇప్పటికైనా రాణించాలని టీమ్ కోరుకుంటోంది. రచిన్‌పై కూడా ప్రధాన బాధ్యత ఉండగా, రాబిన్సన్ దూకుడుగా ఆడగల సమర్థుడు. ఫిలిప్స్, చాప్‌మన్ మరోసారి కీలకం కానుండగా, వన్డే ఫామ్‌ను కొనసాగిస్తున్న మిచెల్ ఈ సారైనా జట్టును గెలిపించాలని పట్టుదలగా ఉన్నాడు. గాయంతో ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్ గత మ్యాచ్‌కు దూరం కావడం కివీస్‌ను బలహీనపర్చింది. అతను కోలుకొని ఈ సారి బరిలోకి దిగే అవకాశం ఉంది. ముగ్గురు పేసర్లలో క్లార్క్‌ను తప్పించి బ్రేస్‌వెల్‌ను ఆడించవచ్చు. ఇతర స్పిన్నర్లు సాంట్నర్, సోధి ఏమాత్రం ప్రభావం చూపిస్తారనేది చూడాలి.తుది జట్లు (అంచనా) భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, సామ్సన్, ఇషాన్ కిషన్, పాండ్యా, దూబే, రింకూ సింగ్, అక్షర్/బిష్ణోయ్, అర్‌ష్‌దీప్, వరుణ్, బుమ్రా. న్యూజిలాండ్: సాంట్నర్ (కెప్టెన్), కాన్వే, రాబిన్సన్, రచిన్, ఫిలిప్స్, చాప్‌మన్, మిచెల్, క్లార్క్/బ్రేస్‌వెల్, జేమీసన్, సోధి, డఫీ.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్. ఈ మైదానంలో రెండేళ్ల క్రితం జరిగిన ఏకైక టి20లో ఆస్ట్రేలియాపై భారత్ గెలిచింది. మంచు ప్రభావం చాలా ఎక్కువ. కాబట్టి ఛేదన సులువు. ఇటీవల భారత్‌పై వన్డేలో దక్షిణాఫ్రికా 358 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

సింధు @500

భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు అరుదైన ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో 500 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన ఆరో క్రీడాకారిణిగా ఘనత అందుకుంది. ఈ రికార్డు నమోదు చేసిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో సింధు ఈ చిరస్మరణీయ విజయంతో క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం ప్రిక్వార్టర్స్‌లో భారత స్టార్ 2119, 2118తో లైన్ హోయ్‌మార్క్ (డెన్మార్క్)పై గెలుపొందింది. మహిళల సింగిల్స్‌లో సింధు కంటే ముందు ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్), తై జు యింగ్ (చైనీస్ తైపీ), అకానె యమగూచి (జపాన్), కరోలినా మారిన్ (స్పెయిన్), పెత్యా నెదెల్చెవా (బల్గేరియా) మాత్రమే 500 విజయాలు నమోదు చేశారు. డబుల్స్ మ్యాచ్‌లను జోడీస్తే సింధు ఖాతాలో మొత్తం 516 విజయాలున్నాయి. ఇక పురుషుల సింగిల్స్‌లో మరో స్టార్ క్రీడాకారుడు లక్ష్యసేన్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 2110, 2111తో జేసన్ గునవాన్ (హాంకాంగ్)పై నెగ్గాడు. కిదాంబి శ్రీకాంత్ 1121, 1021తో చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో అన్మోల్ ఖరబ్ 2116, 615 (రిటైర్డ్)తో నొజోమి ఒకుహర (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో హరిహరన్ అర్జున్ జోడీ 1721, 219, 1621తో వీ చాంగ్ వున్ తీ (మలేసియా) జంట చేతిలో పోరాడి ఓడింది.

జకోవిచ్ జోరు

ఆస్ట్రేలియన్ ఓపెన్లో వెటరన్ స్టార్ నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగుతోంది. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురిపెట్టిన ఈ సెర్బియా దిగ్గజ ఆటగాడు మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. గురువారం పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో నాలుగో సీడ్ జకోవిచ్ 63, 63, 62తో ఫ్రాన్సిస్కో మాస్ట్రెల్లి (ఇటలీ)ని ఓడించాడు. ఈ మ్యాచ్‌లో మూడో సెట్లో ఒకసారి సర్వీస్‌ను కోల్పోవడం తప్పా.. 38 ఏళ్ల జకోవిచ్ ఆధిపత్యం ప్రదర్శించాడు. తన శైలిలో దూకుడుగా ఆడిన అతడు.. క్రాస్‌కోర్టు విన్నర్లు, నెట్ డ్రాప్‌లతో పాయింట్లు సాధించాడు. తొలి సెట్ రెండో గేమ్‌లోనే ఫ్రాన్సిస్కో సర్వీస్ బ్రేక్ చేసిన నొవాక్.. అదే జోరుతో సెట్‌ను తేలిగ్గా గెలుచున్నాడు. రెండో సెట్లోనూ అతడి దూకుడు ముందు ఇటలీ కుర్రాడు నిలవలేకపోయాడు. 52తో ఆధిక్యంలోకి వెళ్లిన జకోవిచ్.. తేలిగ్గా సెట్ గెలిచాడు. మూడో సెట్లో 41తో నొవాక్‌దే పైచేయి. అయితే ఆరో గేమ్‌లో ఈ సెర్బియా స్టార్ అనవసర తప్పిదాలతో అనూహ్యంగా సర్వీస్ కోల్పోయాడు. వెంటనే కోలుకుని ఏడో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. జకోవిచ్ కెరీర్‌లో ఇది 399వ గ్రాండ్‌స్లామ్ విజయం.

రెండో సీడ్ సినర్ (ఇటలీ) ముందంజ వేశాడు. అతడు 61, 64, 62తో డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేశాడు. మ్యాచ్‌లో సినర్ 18 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టాడు. మాజీ ఛాంపియన్ స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్) అతి కష్టంగా రెండో రౌండ్ దాటాడు. అతడు 46, 63, 36, 75, 76 (103)తో ఆర్థర్ గియా (ఫ్రాన్స్)పై గెలిచాడు. నాలుగున్నర గంటలకుపైగా సాగిన ఈ పోరులో వావ్రింకా 11 ఏస్‌లు, 63 విన్నర్లు కొట్టాడు. 1978లో కెన్ రోజ్‌వెల్ (43 ఏళ్లు) తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్ చేరిన పెద్ద వయస్కుడిగా వావ్రింకా (40 ఏళ్లు) ఘనత సాధించాడు. అయిదో సీడ్ ముసెటి (ఇటలీ) 63, 63, 64తో సొనెగో (ఇటలీ)పై, 12వ సీడ్ రూడ్ (నార్వే) 63, 75, 64తో మునార్ (స్పెయిన్)పై, 8వ సీడ్ షెల్టన్ (అమెరికా) 63, 62, 62తో స్వీనీ (ఆస్ట్రేలియా)పై గెలిచారు. సిట్సిపాస్ (గ్రీస్) 46, 63, 67 (57), 67 (57)తో మహాక్ (చెక్) చేతిలో కంగుతిన్నాడు.

స్వైటెక్ ముందుకు: కెరీర్ గ్రాండ్‌స్లామ్ లక్ష్యంగా బరిలో దిగిన పోలెండ్ స్టార్ ఇగా స్వైటెక్ ఆ దిశగా మరో అడుగు ముందుకేసింది. మహిళల సింగిల్స్‌లో ఈ రెండోసీడ్ మూడో రౌండ్ చేరింది. రెండో రౌండ్లో స్వైటెక్ 62, 63తో బజ్కోవా (చెక్)ను ఓడించింది. జపాన్ తార ఒసాకా ముందంజ వేసింది. 63, 46, 62తో క్రిస్టియా (రొమేనియా)ను ఓడించింది. డిఫెండింగ్ ఛాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) 61, 75తో క్రూగర్ (అమెరికా)ను ఓడించగా.. ఆరోసీడ్ పెగులా (అమెరికా) 60, 62తో కెస్లెర్ (అమెరికా)పై, అయిదో సీడ్ రిబకినా (కజకిస్థాన్) 75, 62తో గ్రెచెవా (ఫ్రాన్స్)పై, నాలుగో సీడ్ అనిసిమోవా (అమెరికా) 61, 64తో సినియాకోవా (చెక్)పై గెలిచారు. మాజీ నంబర్‌వన్ ప్లిస్కోవా (రష్యా) 64 64తో టెజెన్ (పోలెండ్)ను ఓడించింది. పదో సీడ్ బెన్సిచ్ (స్విట్జర్లాండ్) 36, 60, 46తో బార్టన్‌కోవా (చెక్) చేతిలో కంగుతింది. బదోసా (స్పెయిన్) 46, 46తో సెలెక్‌మెటెవా (రష్యా) చేతిలో ఓడగా.. ఒస్టాపెంకో (లాత్వియా) 64, 46, 46తో వాంగ్ (చైనా)కు తలొంచింది.

మిక్స్‌డ్‌లో యుకి ఔట్: మిక్స్‌డ్ డబుల్స్‌లో యుకి బాంబ్రి పోరాటం ముగిసింది. తొలి రౌండ్లో యుకిమెలిచార్ మార్టినెజ్ (అమెరికా) జంట 46, 67 (37)తో టిమ్ పజ్ (జర్మనీ)జాంకా

నీ విజయాలు పతకాలకు మించి

దిల్లీ: కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత మాజీ క్రీడాకారిణి సైనా నెహ్వాల్‌పై దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆమె సాధించిన విజయాలు పతకాలకు మించినవని కొనియాడాడు. ''సహనం, ధైర్యం, స్థిరత్వంతో గొప్ప కెరీర్ నిర్మితమవుతుందడానికి నువ్వే (సైనా) నిదర్శనం. భారత బ్యాడ్మింటన్‌ను ప్రపంచ వేదికకు తీసుకెళ్లావు. బ్యాడ్మింటన్ గతినే మార్చావు. అంతర్జాతీయ వేదికలపై విజయాలు సాధ్యమని యువ క్రీడాకారులు నమ్మేలా ప్రేరణ అందించావు. ప్రతి క్రీడా ప్రయాణం పరిణామం చెందుతుంది. ఒక దశ ముగియగానే మరొకటి ప్రారంభమవుతుంది. అలాగే ఆటలో నీ అనుభవం ఎంతో మందికి పాఠం కావాలని కోరుకుంటున్నా. పతకాలకు మించిన గొప్ప విజయాలు నీ సొంతం. కొన్ని తరాలపై నీ ప్రభావం ఉంటుంది'' అని సైనాను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశాడు.

ఆర్సీబీ కొనుగోలు కోసం బిడ్ వేస్తా: అదర్ పూనావాలా

ఐపీఎల్‌లో ఎంతో అభిమాన గణం ఉన్న ఫ్రాంచైజీ, గత సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) త్వరలోనే చేతులు మారనుంది. ఆర్సీబీ యజమాని డియాజియో కంపెనీ ఇప్పటికే ఫ్రాంచైజీ విక్రయ ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తికానున్నట్లు ఆ సంస్థ ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం ఆర్సీబీ విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడానికి భారత్‌తోపాటు కొన్ని విదేశీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా (Adar Poonawalla) కూడా బెంగళూరు జట్టును దక్కించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 'ఐపీఎల్‌లోని అత్యుత్తమ జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు' ఫ్రాంచైజీ కొనుగోలు చేయడం కోసం రాబోయే కొద్ది నెలల్లో నేను బలమైన, పోటీతత్వమైన బిడ్‌ను వేస్తాను' అని అదర్ పూనావాలా గురువారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 2008లో ఐపీఎల్ ఆరంభ సమయంలో యూబీ గ్రూపు అధినేత విజయ్ మాల్యా బెంగళూరు ఫ్రాంచైజీని దక్కించుకున్నాడు. అనంతరం మాల్యా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో భారత్‌లోని తన అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా బెంగళూరు ఫ్రాంచైజీని డియాజియో కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

న్యూజిలాండ్‌పై మొదటి టీ20లో గెలిచాం.. కానీ!

న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 21 తేడాతో ఓడిన భారత్‌కు మొదటి టీ20 విజయం ఊరటనిచ్చింది. కొంతకాలంగా తాను ఆధిపత్యం చూపిస్తున్న ఫార్మాట్‌లో నూతన సంవత్సరాన్ని గెలుపుతో ప్రారంభించింది! తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా (Team India) నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన న్యూజిలాండ్ 7 వికెట్లు నష్టపోయి 190 రన్స్ సాధించింది. దీంతో టీమ్‌ఇండియా 48 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసిన విషయం తెలిసిందే.

--గెలిచినా.. తప్పని కలవరం!

కివీస్‌పై తొలి టీ20లో టీమ్‌ఇండియా విజయమైతే సాధించింది. అయితే.. మన ఫీల్డింగ్ వైఫల్యాలు కలవరపాటుకు గురిచేశాయి. స్కోర్ బోర్డు మీద భారీ స్కోర్ ఉంది కాబట్టి.. పెద్దగా ఇబ్బంది పడలేదు కానీ.. మనం కూడా ఓ 20, 30 పరుగులు తక్కువ చేసి ఉంటే.. పరిస్థితి మరోలా ఉండేది. ఫీల్డర్లు అందివచ్చిన అవకాశాలను జారవిడవడమే దీనికి కారణం.

--ఒక రనౌట్.. రెండు క్యాచ్‌లు..

ఈ మ్యాచ్‌లో భారత్.. బ్యాటింగ్, బౌలింగ్‌లో అధిపత్యం ప్రదర్శించినప్పటికీ.. ఫీల్డింగ్‌లో మాత్రం కొన్ని పొరపాట్లు చేసింది. మొత్తం ఒక రనౌట్.. రెండు క్యాచ్‌లను మన క్రికెటర్లు జారవిడిచారు. పొట్టి ఫార్మాట్లో లీడింగ్‌లో ఉన్న ఓ జట్టుకు ఇలాంటి ఫీల్డింగ్ అసలేమాత్రం ఆమోదయోగ్యం కాదు. సోషల్ మీడియాలోనూ పలువురు టీమ్‌ఇండియా అభిమానులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

--నష్టం జరగలేదు కానీ!

మ్యాచులు గెలవాలంటే క్యాచ్‌లు పట్టాల్సిందే. బౌలింగ్, బ్యాటింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ మెరుపులు రావాల్సిందే. కానీ.. మొదటి టీ20లో కివీస్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు 11వ ఓవర్లో జస్‌ప్రీత్ బుమ్రా (Jasprit Bumrah) బౌలింగ్‌లో మార్క్ చాప్‌మన్ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను రింకు సింగ్ వదిలేశాడు. అలాగే 19వ ఓవర్లో అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో మిచెల్ శాంట్నర్ ఇచ్చిన లడ్డూలాంటి క్యాచ్‌ను ఇషాన్ కిషన్ (Ishan Kishan) నేలపాలు చేశాడు.

--భయపెట్టిన గ్లెన్ ఫిలిప్స్

మొదటి ఓవర్లో అర్షదీప్ సింగ్ (Arshdeep Singh) బౌలింగ్‌లో.. కివీస్ ఓపెనర్ డెవన్ కాన్వే (0) ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ సంజు శాంసన్ (Sanju Samson) ఒడిసి పట్టాడు. కానీ.. శివమ్ దూబె బౌలింగ్‌లో (9.1) గ్లెన్ ఫిలిప్స్‌ను రనౌట్ చేసే అవకాశాన్ని సంజు మిస్ చేశాడు. రింకు సింగ్ వేసిన త్రోను సంజు శాంసన్ సరిగా పట్టుకోలేకపోయాడు. 40 పరుగుల వద్ద లైఫ్ పొందిన గ్లెన్ ఫిలిప్స్ (78) కివీస్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారీ సిక్స్‌లతో కాసేపు భయపెట్టాడు! కానీ చివరికి అక్షర్ పటేల్ బౌలింగ్‌లో శివమ్ దూబెకు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరి కొన్ని రోజుల్లోనే టీ20 వరల్డ్ కప్ (ICC Mens T20 World Cup) ప్రారంభం కానున్ననేపథ్యంలో టీమ్‌ఇండియా తన ఫీల్డింగ్ మీద తగినంత దృష్టి నిలపాల్సిన అవసరాన్ని ఈ ఫీల్డింగ్ వైఫల్యాలు ఎత్తిచూపుతున్నాయి.

అలాగే మెగా టోర్నీకి ముందు ఈ టీ20 సిరీస్‌లో ప్రతికూల ఫలితాలొస్తే.. టీమ్‌ఇండియా ఆటగాళ్ల ఆత్మస్థైర్యం దెబ్బతినే అవకాశమూ ఉంది. అందుకే అప్రమత్తంగా ఉండాలని పలువురు క్రికెట్ విశ్లేషకులు భారత జట్టుకు సూచిస్తున్నారు.